www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శనివారం | 13 | సెప్టెంబర్ | 2025 పేజీలు : 8

## నేడు సురవరం సంస్మరణ సభ

### -హాజరు కానున్న కూనంనేని సహా అఖిలపక్ష నేతలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ ఈనెల 13న సాయంత్రం ఐదు గంటలకు భక్తరామ దాసు కళాక్షేత్రంలో జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఆరు దశాబ్దాల ప్రజా జీవితంలో అనేక చారిత్రక పోరాటాలకు నాయకత్వం వహించిన సురవరం ప్రజల గొంతుకగా పనిచేశారన్నారు. యువజన, విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించి దేశ వ్యాప్తంగా వామపక్ష భావాజలాన్ని ప్రచారం చేశారన్నారు. పార్లమెంట్ సభ్యులుగా చట్టసభలలో ప్రజల గొంతుక వినిపించి జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, సమాచార హక్కు చట్టం తదితర చట్టాలు రావడానికి కృషి చేశారన్నారు. సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, వివిధ రాజకీయ పక్షాల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని సురేష్ తెలిపారు.

# పత్తి రైతు మెడపై సుంకం రద్దు కత్తి





### -సుంకం రద్దుతో తగ్గనున్న పత్తి ధర
### -భవిష్యత్తులో పత్తి సాగుపై నీలినీడలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం అమెరికా ఆంక్షలకు తలొగ్గి పత్తి దిగుమతులపై సుంకాన్ని రద్దు చేయడంతో పత్తి రైతు మెడపై కత్తి పెట్టినట్లయింది. ఇప్పటికే సహకరించని ప్రకృతి, పట్టించుకోని పాలకుల నడుమ పత్తి రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. అతివృష్టి అనావృష్టి దిగుబడిపై ప్రభావం చూపుతుండగా గిట్టుబాటు ధర కల్పించడంలో పాలకులు వైఫల్యం చెందారు. ఈ నేపథ్యంలో దిగుమతి సుంకం రద్దుతో పత్తి ధర మరింత పతనమయ్యే పరిస్థితి నెలకొన్నది. గతంలో అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై భారత ప్రభుత్వం 11 శాతం దిగుమతి సుంకాన్ని విధించేది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపుల తర్వాత భారత్ దిగుమతి సుంకాన్ని రద్దు చేసింది. ఆగస్టు 15న ఎర్రకోట సాక్షిగా

మిగతా 2లో..



## పోడు భూములకు పట్టాలివ్వాలి




**- గిరిజనులపై అటవీ అధికారుల దాడులు ఆపాలి**
**- వలస ఆదివాసీల పిల్లలకు కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయండి**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**
**- కృష్ణసాగర్ నుండి ఐటిడిఏ వరకు వందలాది మందితో పాదయాత్ర**
**- ఐటిడిఏ ఎదుట నిరసన, వినతి పత్రం అందజేత**

**ప్రజాపక్షం/భద్రాచలం :** అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగులో ఉన్న పోడు భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరీ చేయాలని, చేతికొచ్చిన గిరిజనుల పత్తి పంటలను ధ్వంసం చేయడం, గిరిజన రైతులపై అటవీ అధికారులు దాడులు, అక్రమ కేసులు బనాయించడాన్ని మానుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ నుండి భద్రాచలం ఐటిడిఏ వరకు సుమారు 10 కి.మీ పాదయాత్ర సాగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వా వెంకటేశ్వర్లు ఆధ్యక్షతన ఐటిటిఏ ముందు వందలాది మందితో

మిగతా 2లో..

## ప్రజల జీవన గతిని మార్చిన
# సాయుధ పోరాటం



**-సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితి గతులలో మార్పు**
**-యం. వెంకటాయపాలెం సభలో బాగం**

**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తెలంగాణ జీవన గతిని మార్చిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. నిజాం రక్కసి పాలన అంతం కోసం జరిగిన పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం యం. వెంకటాయ పాలెంలో సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. అమరవీరుల స్మారక స్తూపం వద్ద సిపిఐ పతాకాన్ని రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. అమరులు గంగవరపు శ్రీనివాసరావు,

మిగతా 2లో..

# పత్తి రైతు మెడపై సుంకం రద్దు కత్తి

(మొదటిపేజీ తరువాయి)
మోడీ భారత వ్యవసాయ రంగాన్ని కూడా చెప్పిన మాటలు మరిచి పోయి ఆగస్టు 19న దిగుమతి సుంకాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది భారత వ్యవసాయ రంగానికి ప్రత్యేకించి పత్తి రైతాంగానికి ఆశనిపాతంలా తగిలింది. తెలంగాణలో 66 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తున్నారు.గతేడాది అతివృష్టి కారణంగా దిగుబడి రాక ఒకవిధంగా నష్టపోగా నాణ్యమైన పత్తి రాలేదని కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) రైతుల వద్ద సరైన రీతిలో పత్తి కొనుగోలు చేయలేదు. ప్రైవేటు వ్యాపారులకు క్వింటా మూడు వేల నుంచి ఐదువేల నడుమ గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు విక్రయించాల్సి వచ్చింది. ఈ ఏడాది కూడా భారీ వర్షాలు పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. ఒక పక్క దిగుబడి తగ్గి మరో పక్క గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న పత్తి రైతుపై దిగుమతి సుంకం రద్దు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా తయారైంది. పత్తి ధర మరింత తగ్గితే పరిస్థితి ఏమిటన్న ఆందోళనలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.దశాబ్ద కాలంగా మోడీ రైతాంగ వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతున్నది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఇప్పటికీ రోజుకు 31 మంది దేశ వ్యాప్తంగా రైతులు వ్యవసాయ రంగ నష్టాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే దేశీయ సంస్థలను, పారిశ్రామిక రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిన మోడీ వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు యధాశక్తి ప్రయత్నిస్తున్నారు. నూటికి 65 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని పరిరక్షించడానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మోడీ ప్రధాని అయ్యే వరకు వివిధ రూపాలలో ప్రోత్సాహాన్ని అందిస్తూ సబ్సిడీలను ఇచ్చేవారు. దశాబ్ద కాల మోడీ పాలనలో రూ. 87339 కోట్ల సబ్సిడీని తగ్గించారు. కొన్ని సబ్సిడీలను ఎత్తివేశారు. ఒక పక్క వ్యవసాయ రంగ సబ్సిడీలను ఎత్తివేస్తూ మరో పక్క కార్పొరేట్ శక్తులు సంపన్న వర్గాలకు రూ. 26 లక్షల కోట్ల రుణాలను రద్దు చేశారు. వ్యవసాయ రుణాలను రద్దు చేసేందుకు ససేమిరా అంటున్న బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు రూ. 26 లక్షల కోట్లు ఎలా రద్దు చేశారన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేని పరిస్థితి. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉపాధి,ఉద్యోగ కల్పన రంగాలు వట్టిపోతున్నాయి. దేశ జనాభాలో సగభాగం ఉన్న యువతలో మూడొంతుల మంది ఉపాధి ఉద్యోగాలు లేక కొట్టుమిట్టాడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్న ఇప్పటికీ అతిపెద్ద ఉపాధి రంగంగా ఉన్న వ్యవసాయ రంగం పట్ల మోడీ సర్కార్ కక్ష పూరిత నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుంది. వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోతే భారతదేశ ఆర్థిక రంగం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. నెలకో దేశం తిరిగే మోడీకి ఇతర దేశాల్లో వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రోత్సాహకాలు కనిపించక పోవడం భారతదేశ రైతుల పాలిట శాపంగా మారింది. ఇప్పటికే వ్యవసాయ రంగం నుంచి యేటా లక్షలాది కుటుంబాలు వైదొలిగి ప్రత్యామ్నాయ రంగాల వైపు పయనిస్తున్నాయి. మోడీ ప్రభుత్వ నిర్ణయాలతో మరిన్ని మరిన్ని ఇబ్బందికర పరిస్థితులు తలెత్తి వ్యవసాయ రంగం ఇబ్బందులను ఎదుర్కొంటే అది జాతీయ విపత్తుగా మారే ప్రమాదం ఉంది. దేశంలో ప్రధానమైన వ్యవసాయ ఉత్పత్తులకు పెట్టుబడి ఆధారంగా మద్దతు ధర నిర్ణయించాలని దశాబ్దాలుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. మూడు సాగు చట్టాలకు సంబంధించి చారిత్రాత్మక పోరాటం నిర్వహించిన కిసాన్ సంయుక్త మోర్చా నేతృత్వంలో దేశ వ్యాప్తంగారైతు సంఘాలు పత్తి దిగుమతి సుంకం రద్దుపై ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. కేంద్రం దిగివచ్చి సుంకం రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు ప్రధాన పంటలకు పెట్టుబడి ఆధారంగా మద్దతు ధర నిర్ణయించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఆందోళన తీవ్ర రూపం దాలిస్తే మోడీ సర్కార్‌కు చిక్కులు తప్పకపోవచ్చు. ఇదే సమయంలో మేధావులు, వామపక్ష ప్రజాతంత్ర శక్తులకు చెందిన వారు వ్యవసాయ రంగ పరిరక్షణకు సంబంధించి గొంతెత్తడం శుభసూచికం.

# పోడు భూములకు పట్టాలివ్వాలి





(మొదటిపేజీ తరువాయి)
పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీలు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, బూర్గంపాడు మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజనులు 2005 కంటే ముందు నుండే పోడు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. సాగు చేస్తున్న పత్తి చేలను అటవీ అధికారులు ధ్వంసం చేస్తున్నారని, మహిళలపై కూడా విచక్షణారహితంగా వ్యవహరిస్తూ, దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పాతపోడు భూముల్లోనే వ్యవసాయం చేస్తున్నారే తప్ప ఒక్కకొత్త చెట్టును కూడా నరకలేదన్నారు. కనీసమౌళిక సదుపాయాలకు దూరంగా అడవుల్లో జీవనం సాగిస్తున్న వారిపై అటవీ అధికారులు దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడటం సరైంది కాదని, ఈ పద్ధతి మానుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 41 వేల ఎకరాల పోడుకు పట్టాలు ఇవ్వాల్సిం ఉండగా కొంత వరకు ఇచ్చి ఆపేశారని, ఇంకా 90వేల ఎకరాలకు పట్టాలివ్వాలని, ఇందులో 40 వేల ఎకరాలకు పైగా ఆదివాసీలకు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోడు పట్టాలిచ్చి వారికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 122 వలస ఆదివాసీ గ్రామాలు ఉన్నాయని, ఆ గ్రామాల వారికి ఓటు హక్కు కల్పించి, ఆధార్ కార్డులు మంజూరు చేసిన ప్రభుత్వం వారి పిల్లలు చదువుకునేందుకు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని, తద్వారా వారి పిల్లల చదువులు అర్థాంతరంగా ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోడుభూముల సమస్యపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో పలు మార్లు లేవనెత్తారని, గత కొద్దిరోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చంద్రుగొండ మండల పర్యటనలో భాగంగా పలు సమస్యలు పరిష్కరించాలంటూ ఆయన దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. ఈ జిల్లాలోని సహజ వనరులైన బొగ్గు, గోదావరి జలాలు, ఇసుక ఉన్నాయని, కేటిపిఎస్, బిటిపిఎస్ నుండి నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి అవుతుందన, వీటన్నింటిని వాడుకుంటున్న ప్రభుత్వం ఈ జిల్లా ప్రజలకు మేలు చేసేందుకు దృష్టి సారించాలని కోరారు. ఆదివాసీలు, పేదలకు సిపిఐ అండగా ఉంటుందని, సమస్యలు ఎక్కడుంటే అక్కడే సిపిఐ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని, సమస్యలు పరిష్కరించకుంటే జిల్లా కేంద్రంలో 20వేల మందితో పెద్ద ఎత్తున ఆందోళ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఐటిడిఎ కార్యాలయంలో పిఓ అందుబాటులో లేకపోవడంతో పాషా ఐటిడిఎ పీఓకు రాహుల్‌కు ఫోను చేసి సమస్యను వివరించడంతో ఆయన సానుకూలంగాస్పందించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అటవీ అధికారులు జిల్లాలో ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని, అమాయక గిరిజనులను టార్గెట్ చేసుకుని వారి కష్టాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు తాము వ్యతిరేకం కాదని, వారి విధానాలు సరైనవి కాదని చెబుతున్నామని చెప్పారు. అప్పటికైనా ప్రభుత్వం పోడు సమస్యను పరిష్కరించాలని, అక్రమ కేసులు బనాయించడం మానుకోవాలి, ఆదివాసీల పిల్లలకు ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని, అదివాసీ గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ పరిపాలనాధికారి సున్నం రాంబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పేరాల శ్రీనివాస్, జంగం మోహన్ రావు,కంభంమెట్టు శ్రీనివాస్, సాధనపల్లి సతీష్, అలవాల సీతారామరెడ్డి, సోందె కుటుంబ రావు, బూర్గంపాడు మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి ముదిగొండ బాలకృష్ణ, ఏపూరి వెంకటేశ్వరరావు, వంక మహేష్, నారపోగు ఏసు, కొక్కిరేని అశోక్ కుమార్, శంకర్, రమేష్, బిక్షం,శోభన్, బర్ల వెంకటేశ్వర్లు, సిద్దారపు సుబ్బారెడ్డి, లోక్‌రెడ్డి శంకర్ రెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, సాజిత్, భీమా, నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవన గతిని మార్చిన సాయుధ పోరాటం




(మొదటిపేజీ తరువాయి)
గంగవరపు విజయ్‌కుమార్ విగ్రహాలకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, అమరుల స్తూపం వద్ద సిపిఐ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్దినేని కర్ణకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ పల్లెల్లో ప్రజలు దుర్భరంగా జీవించే వారని జమీందార్లు, జాగీర్‌దార్ల పాలనలో ప్రజలను బానిసలుగా చూసేవారన్నారు. ప్రజల మాన, ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ ఉండేది కాదని హేమంతరావు తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ స్వతంత్ర రాజ్యాంగ ప్రకటించుకున్న తర్వాత రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దుం మోహీనుద్దీన్ 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని హేమంతరావు తెలిపారు. సాయుధ పోరాటంలో సామాన్యులు సాయుధులై పోరాడారన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన ఈ పోరాటంలో తెలంగాణ ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తెచ్చిందని హేమంతరావు తెలిపారు. అధికారంలో లేనప్పుడు తెలంగాణ విలీనాన్ని అధికారికంగా నిర్వహిస్తామంటూనే అధికారంలోకి రాగానే మరిచిపోయి మాట మారుస్తున్నారని తెలిపారు. నాటి సాయుధ పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, మిడికంటి వెంకటరెడ్డి, జిల్లా నాయకులు పుచ్చకాయల సుధాకర్, ఉన్నం రంగారావు, లింగా వెంకటనారాయణ, పాసంగుల పాటి చందర్‌రావు, పగిళ్ల వీరభద్రం, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వెంపటి సురేందర్, బండి మాధవరావు, బత్తినేని సీతారాములు, మెట్ల యాదయ్య, యన్నం భాస్కర్, రామ్మూర్తి, బండి ఉపేందర్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## చనిపోయిన బాలుడికి చికిత్స అవాస్తవం

### -ఐఎంఏ బాధ్యులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చనిపోయిన బాలుడికి చికిత్స అందించినట్లు , సోషల్ మీడియాలో ఠాగూర్ సినిమా సీన్ రిపిట్ అంటూ వచ్చిన వార్తలు అవాస్తవమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐఎంఏ బాధ్యులు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా మరిపేడకు చెందిన 13 ఏళ్ల యువకుడు కామెర్లతో బాధపడుతూ చివరి దశలో ఖమ్మంలోని సాయిరాం గ్యాస్ట్రో ఆసుపత్రికి తీసుకు వచ్చారని అప్పటికే అతని పరిస్థితి విషమించిందన్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌కు సదరు బాలున్ని తీసుకెళ్లారని అక్కడి వైద్యులు కాలేయ పరీక్ష, బయాప్సి పరీక్ష నిర్వహించారని ఫలితం 15 రోజుల్లో వస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు సదరు బాలునికి నాటు వైద్యం చేయించారన్నారు. ఖమ్మం ఆసుపత్రికి వచ్చేసరికి బాలుని పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యుల అంగీకారంతోనే ఐదు రోజుల పాటు చికిత్స అందించినట్లు వారు తెలిపారు. ఆతర్వాత ప్రభుత్వ దవాఖానాకు తీసుకెళ్తామని కుటుంబ సభ్యులు తెలపడంతో వారికి ఈసిజి తీయించి గుండె పనితీరును చూపించామని, కాళ్లు, చేతులు ఆడించడం కూడా కుటుంబ సభ్యులు చూశారని తెలిపారు.కానీ సోషల్ మీడియాలో ఠాగూర్ సినిమా రిపిట్ మూడు లక్షలు వసూలు చేశారని, చనిపోయిన బాలునికి చికిత్స అందించారని వార్తలు వచ్చాయని ఇది పూర్తిగా అబద్ధమని దీనికి సంబంధించి సిసి ఫుటేజీలు కూడా ఉన్నాయన్నారు. ఇది వేరే వారు కల్పించిన కథ అని బంధువులు కూడా సదరు వైద్యుల దృష్టికి తీసుకు వచ్చారని దానికి సంబంధించిన సిసి ఫుటేజీలు ఆసుపత్రి వద్ద ఉన్నాయన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలను మానుకోవాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కంభంపాటి నారాయణరావు, స్టేట్ మెడికల్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, డాక్టర్ సునీల్, డాక్టర్ స్వాతి, డాక్టర్ కూరపాటి ప్రదీప్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సురేందర్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంకలు తెలిపారు.

## టిఎన్‌జీవోస్ మున్సిపల్ ఫోరం ఎన్నిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని టిఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్ నందు ఖమ్మం జిల్లా టిఎన్‌జీవోస్ మున్సిపల్ ఫోరం ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ఈ ఎన్నికలకు సంబంధించి సింగిల్ సెట్ నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టిఎన్‌జీవోస్ జనరల్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్ ప్రకటించారు. మున్సిపల్ ఫోరం అధ్యక్షులుగా ఎ. సుధాకర్, అసోసియేట్ అధ్యక్షులుగా ఈ. ఉదయ్‌కుమార్, సెక్రటరీగా జి. శ్రీనివాసరావు లతో పాటు కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్, యూనియన్ బాధ్యులు, సత్తుపల్లి, మధిర, వైరా, కల్లూరు, ఏదులాపురం, ఖమ్మం కార్పోరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు

**-తేమ శాతం ప్రకారం మద్దతు ధర చెల్లింపు**
**-అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశం**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నాణ్యమైన పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో 2025 26 పత్తి సీజన్‌లో సిసిఐచే పత్తి కొనుగోళ్లపై అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ పత్తి రైతులకు పత్తి అమ్మకాల్లో ఇబ్బందులు లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది 2,25,613 ఎకరాల్లో పత్తి సాగు చేశారని 27,07,356 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందన్న అంచనా ఉందన్నారు. ఐదు సిసిఐ కేంద్రాలు, తొమ్మిది జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోలుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. నిబంధనల మేరకు పత్తి కొనుగోళ్లు చేయాలన్నారు. రైతులు కనీస మద్దతు ధర పొందడానికి ఆధార్ తప్పనిసరి అని అదనపు కలెక్టర్ తెలిపారు. కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు నమోదు కావాలని తెలిపారు. మద్దతు ధర తేమ శాతం, కొనుగోళ్లపై విస్తృత ప్రచారం చేయాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించి చైతన్యపర్చాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సజావుగా పత్తి కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఎ అలీం, సిపివో ఎ. శ్రీనివాస్, ఆర్డీవో వెంకటరమణ, సిసిఐ జిల్లా ఇంచార్జి అవినాష్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాజీరెడ్డి, విద్యుత్ శాఖ డిఈ రామారావు, మార్కెట్ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి డిపో కార్మికుల సమస్యలను పరిష్కరించండి

**-ఆర్టీసి జేఏసి డిమాండ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భద్రాచలం డిపోలో ఐదు రోజుల నుండి పని భారాలకు, మస్టర్ల కుదింపుకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనకు ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆర్టీసి ఐక్య కార్యాచరణ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. యాజమాన్యం తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. జేఏసి ఆధ్వర్యంలో శుక్రవారం పర్సనల్ ఆఫీసర్ సంపత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసి నేతలు మాట్లాడుతూ భద్రాచలం డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి కార్మికులపై అధిక పని భారాలు మోపుతూ మూడురోజుల మస్టర్ డ్యూటీని రెండు రోజులకు, రెండు రోజుల డ్యూటీని ఒక రోజుకు కుదించి వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. చిన్న చిన్న పొరపాట్లకు చార్జ్‌షీట్ ఇచ్చి ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. ప్రశ్నించే వారు లేరని భయభ్రాంతులకు గురి చేస్తూ కట్టుబానిసల్లా చూస్తున్నారని జేఏసి నేతలు తెలిపారు. ఆర్టీసి యాజమాన్యం వెంటనే డిపోల్లో జరుగుతున్న ఆందోళనకు సంబంధించి కార్మికులతో చర్చించి మోటార్ ట్రాన్స్‌పోర్టు యాక్ట్ ప్రకారం డ్యూటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రీజియన్ వ్యాప్తంగా జేఏసి ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ జేఏసి నాయకులు పి. రమేష్, బుచ్చిబాబు (ఎంప్లాయీస్ యూనియన్), కృష్ణ, వినోదరావు (తెలంగాణ మజ్దూర్ యూనియన్) , సుధాకర్, జి. మాధవరావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), హన్మంతరావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్), ఆర్‌టిరావు (నేషనల్ మజ్దూర్ యూనియన్ ) తదితరులు పాల్గొన్నారు.

# వివాదస్పద భూములకు ఫెన్సింగ్

**-ఎవరికి ప్రవేశం లేదంటూ బోర్డు ఏర్పాటు**
**-ఫెన్సింగ్ పనులను పర్యవేక్షించిన ఆర్డీవో తహసీల్దార్**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగు రెవెన్యూ పరిధిలోని వివాద స్పద భూములకు రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ వేశారు. శుక్రవారం రెవెన్యూ అధికారులు ఉదయం ఆరు గంటలకు భారీ పోలీస్ బందోబస్తుతో మల్లెమడుగు రెవెన్యూ పరిధిలోని రఘునాథపాలెం సమీపంలో గల భూముల వద్దకు చేరుకున్నారు. ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, అర్బన్ తహసీల్దార్ సైదులు ఆధ్వర్యంలో మల్లెమడుగు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 194, 195, 198 లోని సుమారు 30.2 ఎకరాల భూమికి ఫెన్సింగ్ రాళ్లు పాతి తీగను చుట్టారు. ఈ భూములకు సంబంధించి గత కొన్నేళ్లుగా అమ్ముకున్న రైతులు, కొనుగోలు చేసిన వ్యక్తులు, ప్రభుత్వం మధ్య వివాదం నడుస్తుంది. దీనికి సంబంధించి ఈ ఏడాది మే నెలలో హైకోర్టు స్టేటస్ కో విధించింది. అయితే అప్పుడు పంటలు వేసుకున్న రైతులు పంట ఉత్పత్తుల సేకరణ తర్వాత భూములను వదిలేయాలని తీర్పునిచ్చింది. అయినప్పటికీ మరల వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో కోర్టు తీర్పు ఉన్నప్పటికీ అట్టి భూముల్లో పంటల సాగు చేపట్టారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు సదరు భూములకు ఫెన్సింగ్ వేసి కోర్టు పరిధిలో ఉన్నందున ఎవరికి ప్రవేశం లేదంటూ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అర్బన్ తహసీల్దార్ సైదులు మాట్లాడుతూ మల్లెమడుగు రెవెన్యూ పరిధిలోని 194, 195, 198సర్వే నెంబర్లలో 30.23 ఎకరాలు సిలింగ్ భూమిగా గుర్తించి ఫెన్సింగ్ వేయడం జరిగిందన్నారు. కొందరు వాటిని పట్టా భూములుగా చెబుతున్నారన్నారు. దీనికి సంబంధించి కోర్టులో కేసు నడుస్తుందన్నారు. కోర్టులో కేసు ఉన్న నేపథ్యంలో అట్టి భూముల్లోకి ఎవరు వెళ్లవద్దని బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు అట్టి భూమికి చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా భూములు కొనుగోలు చేసిన టి. శ్రీనివాసరావు తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని తెలిపారు. భూముల వ్యవహారం కోర్టులో ఉందని ఫెన్సింగ్ వేసే అధికారం రెవెన్యూ అధికారులకు లేదని దౌర్జన్యంగా రాజకీయ ప్రోద్బలంతోనే ఇలా చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండలో గల 33/11కెవి సబ్‌స్టేషన్ మరమ్మత్తులలో భాగంగా నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగునుందని ఏఈ జిల్లా ప్రభాకర్ రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు పెద్దతండా, సాయిప్రభాత్‌నగర్, టీచర్స్ కాలనీ, నాయుడుపేట, ఆర్టీసీకాలనీ, తాల్లేసితండా, టిఎన్‌జిఓకాలనీ, సాయిప్రభాత్‌నగర్, బిబిఎంస్కూల్‌రోడ్డు, ఆర్‌ఎస్‌నగర్, జలగంనగర్‌పరిధిలలో సరఫరాకు అంతరాయం ఉంటుంది. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# ఈవిఎం గోడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. శుక్రవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేశారు. తొలుత ఈవిఎం గోడౌన్ సీల్‌ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి ఈవిఎం, వివి ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. ఫైర్ అలారం పరిశీలించారు. అగ్నిమాపక యంత్రాలు కండిషన్ పర్యవేక్షణ చేయాలన్నారు. మొదటి అంతస్తులో స్లాబ్‌ను పరిశీలించి నీరు నిల్వ ఉండకుండా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిసి కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ గార్డ్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎంఏ రాజు, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మేరీ ఏసుపాదం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఖమ్మంకు చెందిన మేరీ ఏసుపాదం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మహాసభ గురువారం హైదరాబాద్‌లో జరగగా ఆ ఎన్నికల్లో మేరీ ఏసుపాదం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1990లో పిజిటి హోదాలో ఉపాధ్యాయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె జూనియర్ లెక్చరర్‌గా ఆతర్వాత గ్రేడ్ 2, గ్రేడ్ 1 ప్రిన్సిపాల్‌గా పనిచేసి డిప్యూటీ సెక్రటరీగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. డిప్యూటేషన్‌పై నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో పని చేశారు. ఉద్యోగ అనంతరం పెన్షనర్ల సంఘం ఖమ్మం జిల్లా శాఖలో పని చేస్తున్నారు. ఈ సందర్భంగా మేరీ ఏసుపాదం మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మేరీ ఏసుపాదం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా పలువురు అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్, ఆర్థిక కార్యదర్శి గుర్రాల శ్రీనివాసరావు, కనపర్తి వెంకటేశ్వర్లు, కొల్లికొండ శరత్‌బాబు, తాడి అంజలి, లక్ష్మి సుజాత తదితరులు అభినందనలు తెలిపారు.

# పాఠశాలకు కంప్యూటర్లు, ఫ్యాన్ల బహుకరణ




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఎంవీ,పాలెం ఉన్నత పాఠశాలకు ఖమ్మం ఐడిబిఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ.2లక్షల విలువైన కంప్యూటర్లు, గోడ ఫ్యాన్లను శుక్రవారం బహుకరించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన డిజిటల్ లెర్నింగ్ ల్యాబ్‌ను ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేసి కంప్యూటర్లను స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీఓ శ్రీదేవి, ఎంఈఓ ఎం శ్రీనివాస్, ఖమ్మంసూర్యాపేట బ్రాంచ్ మేనేజర్లు కృష్ణప్రసాద్, నాగరాజు, బ్యాంక్ సిబ్బంది వెంకన్న, శివ, రమేష్, వెంకట్, పంచాయతీ కార్యదర్శి శ్రీ లక్ష్మి , గ్రామ పెద్దలు ఎడ్లపల్లి వెంకటరామయ్య, మందటి వెంకరమణ, నాగయ్య, నాగేశ్వరారవు, భాగ్యమ్మ, ప్రసాద్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బీటెక్ ఫలితాలలో శ్రీచైతన్య ప్రభంజనం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం పొన్నెకల్లు పంచాయతీపరిధిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బీటెక్ ఫలితాలలో ప్రభంజనం చాటారు. హైదరాబాద్ జెఎన్‌టియూ ఆధ్వర్యంలో గురువారం విడుదల చేసిన ఫలితాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి హసీనా 9.5, పోకల రమాదేవి 9.3, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో షేక్ సమీనా 9.3, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్‌లో దారోజు విజయదుర్గ 9.2, డేటా సైన్స్‌లో పసుపులేటి సంతోష్ 9.2, ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో నిమ్మల వికాస్ 9, సివిల్‌లో కన్నం పూజిత 8.6, మెకానికల్‌లో సాయిగణేష్ 8.36 సాధించారు. అలాగే 138పైబడిన విద్యార్థులు ఆయా విభాగలలో 8.0ఎస్‌జిపిఏను సాధించారు. కాగా సదరు విద్యార్థులను కళాశాలలో యాజమాన్యం, ఫ్యాకల్టీ శుక్రవారం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సాయిగీతిక, డైరెక్టర్ శ్రీవిద్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మినారాయణ, అకాడమిక్ డీన్ డాక్టర్ సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, ఆడ్మినిస్టేటివ్ ఆఫీసర్ వైశాలి, డిప్లొమా ఇంచార్జి కృష్ణప్రసాద్, వివిద విభాగల అధిపతులు డాక్టర్ చిరంజీవి, డాక్టర్ ప్రణతి, శ్రీ కుమార్ పాల్గొన్నారు.

# నేడు జాతీయ లోక్ అదాలత్

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం శనివారం ఖమ్మంలో జాతీయ లోక్ అదాలత్ జరగనుంది. కేసులు పరిష్కరించుకోవడానికి కక్షిదారులు హాజరు కావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. రాజగోపాల్ కోరారు. రాజీపడటం ఇద్దరి గెలుపుగా భావించాలని ఆయన సూచించారు. మోటార్ వాహన , ప్రమాద బీమా కేసులతో సివిల్ వివాదాల కేసులను మూడవ అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి దేవినేని రాంప్రసాదరావు, సివిల్, క్రిమినల్ కేసులకు రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి. మురళీమోహన్, ఫ్రీ లిటిగేషన్ కేసులకు సంస్థ కార్యదర్శి కెవి చంద్రశేఖర్‌రావు, ప్రత్యేక బెంచ్‌లు నిర్వహిస్తారని మిగిలిన కోర్టుల్లో వారి వారి బెంచీల్లో కేసులు పరిశీలించబడతాయన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు కాసరగడ్డ దీప, ఒకటవ అదనపు ప్రథమశ్రేణి కోర్టుకు న్యాయాధికారి బి. రజని, రెండవ అదనపు ప్రథమ శ్రేణి కోర్టుకు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ, మిగిలిన న్యాయస్థానాలకు న్యాయాధికారులు వినుకొండ మాధవి, బి. నాగలక్ష్మి ప్రత్యేక బెంచ్‌లను నిర్వహిస్తారని రాజగోపాల్ తెలిపారు. ఈ లోక్ అదాలత్ కక్షిదారుల సౌకర్యార్థం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు.

# సేవాధృక్పథంతో మమతలో వైద్య సేవలు

-ప్రజల చెంతకు ఆధునీక వైద్యం
-గైనకాలజీ విభాగంలో అరుదైన శస్త్రచికిత్సలు
- విలేకరుల సమావేశంలో మమత సంస్థల కార్యదర్శి జయశ్రీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వ్యాపార ధృక్పథంతో కాకుండా సేవాధృక్పథంతో మమత వైద్య సంస్థల్లో వైద్య సేవలు అందిస్తున్నట్లు మమత వైద్య విద్యా సంస్థ కార్యదర్శి పువ్వాడ జయశ్రీ తెలిపారు. ప్రజల చెంతకు ఆధునీక వైద్యం అందించడమే మమత లక్ష్యమని ఆమె తెలిపారు. శుక్రవారం మమత ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పువ్వాడ జయశ్రీ మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం మమత వైద్య విద్యా సంస్థలను స్థాపించి ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజలకు అత్యాధునీక వైద్య సేవలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. వ్యాపార ధృక్పథంతో కాకుండా సేవా ధృక్పథంతో ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. జనరల్ ఆసుపత్రితో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేసి అతి తక్కువ ఖర్చుతో అన్ని విభాగాల్లోనూ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ వంటి నగరాలకే పరిమితమైన అరుదైన, క్లిష్టతరమైన శస్త్ర చికిత్సలు సైతం తక్కువ ఖర్చుతో, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. మమతలో అందించే వైద్య సేవలను, శస్త్ర చికిత్సలను ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గైనకాలజీ విభాగంలోనూ అరుదైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

### గైనకాలజీ విభాగంలో శస్త్రచికిత్సలు విజయవంతం...

గైనకాలజీ విభాగంలో అరుదైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ కవిత, డాక్టర్ గీత లు తెలిపారు. సూర్యాపేటకు చెందిన 32 ఏళ్ల మహిళకు గతంలో సిజేరియన్ ఆపరేషన్ జరిగిందని తెలిపారు. ఆమెకు పుట్టుకతోనే గుండె జబ్బులు ఉన్నాయన్నారు. ఆమె గర్భం దాల్చిన మూడవ నెలలో సంక్లిష్టమైన అండాశయ తిత్తి ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ఆ తిత్తిని ఐదవ నెలలో ల్యాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స ద్వారా తొలగించామని ప్రసవం జరిగే వరకు పర్యవేక్షించామన్నారు. ఆమె సీజేరియన్ ద్వారా బిడ్డను ప్రసవించిందని తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా హుజుర్ నగర్‌కు చెందిన 28 ఏళ్ల మహిళ తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ మమత ఆసుపత్రికి వచ్చిందని తెలిపారు. ఆమె ఐదు నెలల గర్భిణితో ఉందని ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఫైబ్రాయిడ్ ఉన్నట్లు గుర్తించామన్నారు. ఫైబ్రాయిడ్‌ను శస్త్రచికిత్స ద్వారా తొలగించినట్లు తెలిపారు. ప్రసవం వరకు ఆమెను పర్యవేక్షించామన్నారు. ఆమె బిడ్డకు జన్మనిచ్చిందని తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ పువ్వాడ సాయిశిరిణి , గైనకాలజీ హెచ్‌వోడి డాక్టర్ నైమిషా మొవ్వా, ప్రిన్సిపల్ డాక్టర్ అనురాధ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి, ఆర్ఎంవో డాక్టర్ కె. సంతోష్‌రెడ్డి, వైద్య బృందం స్నేహ, దేవిశ్రీ, మనీషా, పిజి వైద్యులు జ్యోత్స్న, రోషిణి, కళ్యాణి, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై కేసు నమోదు సరికాదు

-తక్షణం ఉపసంహరించుకోవాలి : టియుడబ్ల్యూజె (ఐజెయు)

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జర్నలిస్టులపై పోలీసులు కేసులు నమోదు చేయడం సరికాదని తక్షణం కేసును ఉపసంహరించుకోవాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కొణిజర్ల పోలీసులు టి న్యూస్ జిల్లా రిపోర్టర్ సాంబశివరావు, వీడియో జర్నలిస్టు నాగరాజులతో పాటు మరో జర్నలిస్టుపై కేసు నమోదు చేయడాన్ని జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు ఒక ప్రకటన విడుదల చేశారు. మారిన పరిస్థితుల్లో యాజమాన్యాలు కోరినవిధంగా జర్నలిస్టులు పనిచేయాల్సి వస్తుందని ఈ నేపథ్యంలో పోలీసులు కేసులు నమోదు చేయడం, ఇబ్బందులు పెట్టడం సరైంది కాదన్నారు. కేసును ఉపసంహరించుకోవాలని వెంకటేశ్వరరావు, పాపారావు లు కోరారు.

# ఎయిడ్స్‌పై కళాజాత



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ కళా ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో ఎయిడ్స్ ఎలా వస్తుంది, రాకుండా ఉండేందుకు జాగ్రత్తల పై తమ కళా ప్రదర్శన ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో అర్థమయ్యే విధంగా వివరించారు. కండోమ్స్ యొక్క ప్రాధాన్యత, సుఖ వ్యాధుల గురించి ఐసిటిసి సేవలు మందుల వివరాలు వినియోగం, ఏఆర్‌టిసి సేవలు, గర్భిణీలు భార్యాభర్తలు హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని ఈ సందర్భంగా కళాజాతలో ప్రజలను కోరారు. పుట్టబోయే బిడ్డ హెచ్ఐవి లేకుండా కాపాడాలని మరియు 1097 టోల్ ఫ్రీ నెంబర్ గురించి అన్ని అంశాలపై అవగాహన, ఆటపాటల ద్వారా వివరించారు. చెన్నూరు ప్రధాన సెంటర్లో నిర్వహించిన ఈ కళాజాత పలువురు ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు ప్రేమ కుమారి, వెంకటేశ్వర్లు, ప్రసాద్, చంద్రమోహన్, మధు, ఉద్దండు బి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా బిడ్డల ఆదరణ మరువలేనిది : ఎంపి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అమెరికాలో మన తెలుగు బిడ్డలు చూపిన ఆదరణ మరువలేనిదని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. అమెరికాలో స్థిరపడ్డ మున్నూరుకాపులంతా అక్కున చేర్చుకున్నారని కాపుల అవసరాల కోసం భవనాలు నిర్మించాలని తాను చేసిన సూచనను అందరూ ఆమోదించారన్నారు. ఇటీవల అమెరికా పర్యటన పూర్తి చేసుకుని తొలిసారి ఖమ్మం వచ్చిన వద్దిరాజు రవిచంద్రను ఖమ్మం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆకుల గాంధీ అధ్యక్షతన జరిగినసభలో వద్దిరాజు మాట్లాడుతూ వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా జీవించే మున్నూరు కాపులు బిసి కులాల్లోని అన్ని వర్గాలను కలుపుకుని పోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు ప్రముఖులు మేకల బిక్షమయ్య, పారా నాగేవ్వరరావు, జాబిశెట్టి శ్రీనివాసరావు,




కనకం జనార్ధన్, మేకల శ్రీనివాసరావు, తోట రామారావు, శీలంశెట్టి వీరభద్రం, తోట వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# మధిర రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలన

**ప్రజాపక్షం/ మధిర :** అమృతభారత్ పథకం ద్వారా రూ.25కోట్ల వ్యయంతో మధిర రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతుండగా శుక్రవారం బిజెపి టౌన్ అధ్యక్షులు గడ్డం శ్రీహరి చౌదరి, శివరాజ్ సుమంత్ ఆధ్వర్యంలో బిజెపి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రైళ్ల హాల్టింగ్ వివరాలను స్టేషన్ మాస్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. రైల్వేస్టేషన్లను విమానాశ్రయాల స్థాయిలో అభివృద్ధి చేస్తున్న మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గుగులోతు నాగేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండా చంద్రశేఖర్, పాపట్ల రమేష్, జిల్లా నాయకులు చిలువేరు సాంబశివరావు, రామిశెట్టి నాగేశ్వరరావు, స్వర్ణాకర్, మండల ఉపాధ్యక్షులు పెరుమాళ్ళపల్లి మోహన్‌రావు, మండల నాయకులు దోర్నాల దినకర్, ఖాజామీయా తదితరులు పాల్గొన్నారు.

# హోమియో ఆరోగ్య వైద్య శిబిరం విజయవంతం

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం చిన్న కోరుకొండి గ్రామపంచాయతీ ఆవరణ యందు శుక్రవారం ఉచిత హోమియో ఆరోగ్య వైద్య శిబిరం జరిగింది. వారికి ఉచితంగా హోమియో, అలోపతి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లెదవ ఖానా వైద్యులు సాకేత్, యోగా ఉపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ యోగా వలన మానసిక ఆరోగ్యం మెరుగుపడి, శారీరకంగా దృఢ కాయులుగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేషంట్ కేర్ దివ్యశ్రీలతో పాటు ఆరోగ్య కార్యకర్తలు నాగమణి, కృష్ణవేణి పుల్లమ్మ, ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శి మహేష్ లతో పాటు పరిసర గ్రామాలైన తెలగవరం, మర్లపాడు, కిష్టారం, తాళ్లూరు వెంకటాపురం, వెన్నవల్లి, పోచవరం, పెద్ద కోరుకొండి, దారుక బంజర్, ప్రజలు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

-డిసిపి ప్రసాదరావుకు టిజెఎఫ్ వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జర్నలిస్టులపై కొణిజర్ల పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని జర్నలిస్టులపై కేసు నమోదు సరికాదు తక్షణం ఉపసంహరించుకోవాలని టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) డిమాండ్ చేసింది. శుక్రవారం ఈ మేరకు అడిషనల్ డిసిపి ప్రసాదరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిజెఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆదినారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులపై అకారణంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలన్నారు. టిన్యూస్ ఛానెల్ జిల్లా ప్రతినిధి సాంబశివరావుపై వీడియో జర్నలిస్టు, టెక్నిషియన్ పై పెట్టిన కేసును పునః పరిశీలన చేసి ఉపసంహరించుకోవాలన్నారు. కేసులు ఉపసంహరించుకోకపోతే జిల్లా వ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తామని ఆదినారాయణ తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడాన్ని




తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా కార్యదర్శి చిర్రా రవి, ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా బాధ్యులు రజనీకాంత్, వెంకటరమణ, ఉదయ్, హరీష్, వనం నాగయ్య, రమేష్, రాంబాబు, శ్రీనివాస్, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# సాయుధ పోరాటాన్ని దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/బోనకల్ః** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవాన్ని సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మోటమర్రి గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు మరీదు హన్మంతు స్మారక స్థూపానికి పూలమాలలు వేసి వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శి వంగాల కృష్ణ, మరీదు నాగేశ్వరరావు, మరీదు రాము, స్రవంతి, వంగాల అబ్బులుతదితరులు నిర్వహించారు.

# సేవా కార్యక్రమాలు నిర్వహించండి

**ప్రజాపక్షం/తల్లాడ :** భారత ప్రధాని నరేంద్రమోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పక్వాడ్ అను నినాదంతో సేవే లక్ష్యంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తల్లాడ మండల బిజేపి అధ్యక్షుడు చల్లా నాగులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం తల్లాడలో కార్యశాల సేవా పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు భారతీయ జనతాపార్టీ తెలంగాణ రాష్ట్రశాఖ పిలుపు మేరకు బిజేపి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేవే లక్ష్యంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్ధేశించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ గాదె కృష్ణారావు, ప్రధాన కార్యదర్శులు రాయల రమేష్, పెరిక కిరణ్, కన్వీనర్ చల్లా నరేష్, ఉపాధ్యక్షులు గొల్లమండల నరేష్, మండల కోశాధి



కారి తమ్మిశెట్టి కృష్ణ, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు చౌడ నాగేశ్వరరావు, ఓబిసి మోర్చా సమ్మెట రాంబాబు, కోకన్వీనర్ నరసింహారావు, మాజీ ఉపాధ్యక్షులు సంగీతం సాయిచందు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గూటికి చింతకాని బారాస అధ్యక్షుడు

**ప్రజాపక్షం/చింతకాని:** మధిర నియోజకవర్గంలో బారాస కోటకు బీటలు వారుతున్నాయి. బారాసలో బలమైన నేతలంతా కాంగ్రెస్ గూటికి చేరుతుండగా తాజాగా శుక్రవారం చింతకాని మండల సీనియర్ నాయకులు,బారాస మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కాంగ్రెస్ గూటికి చేరేందుకు లైన్ క్లియర్ చేసుకున్నారు. చింతకాని మండలంలో రెండు దశాబ్దాలుగా నాడు తెలుగుదేశం, నిన్నటి వరకు బిఆర్ఎస్ నేతగా ఏకచత్రాధిపత్యంతో చక్రం తిప్పిన రాజకీయ కురువృధ్ధుడు పెంట్యాల పుల్లయ్య శుక్రవారం హైదరాబాద్‌లో ప్రగతి భవన్ నందు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు సంసిద్దత వ్యక్తం చేశారు. తొలుత డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని ని కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడనై నిమోజకవర్గం, చింతకాని మండలంలో భట్టి విక్రమార్క చేపడుతన్న అభివృద్ధి లో కలిసి నడిచేందుకు సిద్దమైనట్లు పేర్కొన్నారు. త్వరలోనే మండలంలో బారాస నుంచి భారీ చేరికలు ఉంటాయని తెలిపారు.

# దసరా ఉత్సవాలకు కుదిరిన ముహూర్తం

**- నవదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు**
**- ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు**
**- ఈ నెల 21 నుండి బతకమ్మ సంబురాలు ప్రారంభం**



**ప్రజాపక్షం/భద్రాచలం :** దసరా ఉత్సవాలకు స్థానిక భూపతిరావు కాలనీలో కొలువై ఉన్న శ్రీ నవదుర్గ అమ్మవారి ఆలయంలో ముహూర్తం కుదిరింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ పనుల ప్రారంభ సూచికగా పాలకర్రను ప్రత్యేక పూజల నడుమ ఏర్పాటు చేశారు. ముందుగా అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని దూపదీప నైవేద్యాలు సమర్పించిన అనంతరం అమ్మవారికి హారతులు పట్టారు. దసరా ఉత్సవాలు అంటే నవరాత్రుల పాటు (తొమ్మిదిరోజులు) పండగ వాతావరణం నెలకొంటుంది. దీనిని శరన్నవరాత్రి మహోత్సవాలుగా పిలుస్తుంటారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ సుద్ధ నవమి వరకు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి పూజలు జరుపుతారు. ఆ మరుసటి రోజు విజయదశమి వస్తుంది. దసరా ఉత్సవాల్లో అమ్మవారు పరాశక్తి, ఆదిశక్తిగా భక్తులతో పూజలు అందుకుంటుంది.

**21 నుండి బతుకమ్మ...**

తెలంగాణ సంప్రదాయం ప్రకారం ఈనెల 21వ తేది నుండి బతుకమ్మ పండుగ ప్రారంభమై 30వ తేది నాటికి ముగుస్తుంది. కాగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుండి దసరా సంబురాల్లో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. దసరా సందర్భంగా బతుకమ్మ సంబురాలను తెలంగాణ తొలి ప్రభుత్వం సాంప్రదాయ ప్రతీకగా ప్రారంభించింది. తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రకాల బతుకమ్మలతో ఆలయాల వద్ద పూజలు నిర్వహిస్తారు. మొదటిది ఎంగిలిపూల బతకమ్మ, అటుకుల బతకమ్మ, ముద్దపప్పు బతకమ్మ, నానబియ్యం బతకమ్మ, అట్ల బతకమ్మ, అలిగిన బతకమ్మ, వేపకాయ బతకమ్మ, వెన్నముద్దల బతకమ్మ, తొమ్మిదోరోజు సద్దుల బతకమ్మ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నవదుర్గ అమ్మవారి ఉత్సవ కమిటీ తగిన ఏర్పాట్లు చేస్తోంది.

**1988 నుండి నిర్విరామంగా...**

భూపతిరావు కాలనీలో ఉన్న నవదుర్గ అమ్మవారి ఆలయంలో 1988లో ఏర్పాటు చేశారు. ఇక్కడ అప్పట్నించి 37 సం.లుగా ప్రతీ ఏటా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. అప్పటి తరం వారి పిల్లలు దీనిని వారసత్వంగా కొనసాగిస్తున్నారు. కాగా సర్వమతాలకు చెందిన ఆలయాలు కాలనీలో ఉండటంతో ఈ ఉత్సవాల సమయంలో అన్ని కుటుంబాల వారు ప్రోత్సహిస్తుంటారు. ఈ ముహూర్త కార్యక్రమంలో దలాయి ప్రసాద్, కిషోర్, సలీం, జిన్న, ఆనంద్, శ్రీను, సంతు, సంధ్య, రమాదేవి, రమణ, జ్యోతి, రమ, పాషా, పర్వీన్‌తో పాటు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీతో పాటు బెండాలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు పలు సంక్షేమ పథకాలు అందజేయటమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు రేషన్ కార్డులు, ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా విడతల వారీగా అమలు చేసి తీరుతామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నిరూపించామన్నారు. ఇందిరమ్మ ఇల్లు విడతల వారీగా అర్హులైన పేదవారికి ఇచ్చి తీరుతామన్నారు. బిఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణ చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ నాయకులు రైతులకు యూరియా కొరత ఉన్నదని ఆరోపణలు చేయడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం లేదని ప్రశ్నించారు. బీసీలకు 42శాతం ఇచ్చే విధంగా కృషి చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అనంతరం బెండాలపాడు గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో హస్తాల వీరన్న ఆలయం వద్ద భోజన కార్యక్రమంలో మండల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, ఆ పార్టీ నాయకులు బోజ్య నాయక్, అశ్వారావుపేట సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్ష, తుమ్మలపల్లి సురేష్, ఉప్పతల ఏడుకొండలు, ప్రసాద్, సారేపల్లి శేఖర్, కిరణ్‌రెడ్డి, బొర్రా సురేష్, సంక శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, శిథిలమైన భవనాల స్థానంలో నూతన నిర్మాణాలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ కోరారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం ఐడిఓసిలోని సూపరింటెండెంట్ శ్రీధర్‌కు శుక్రవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ జిల్లాని అన్ని ప్రభుత్వ బడుల్లో అరకొర వసతులున్నాయని, కనీస మౌళిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యను అందిస్తామని ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతున్నప్పటికీ విద్యార్థులు వానకు వలవల, ఎండకు విలవిల్లాడుతూ చదువులకు దూరమవుతున్నారని అన్నారు. మౌళిక సదుపాయాలు లేకుండా నాణ్యమైన విద్యను ఏ విధంగా అందిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవ చూపి ప్రభుత్వ విద్యారంగాన్ని బ్రతికించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్‌కే షాహిద్, జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, ఇనపల్లి పవన్‌సాయి, వినయ్. సంజయ్, నాజిర్ పాల్గొన్నారు.

# భారతీయ భావనకు ప్రతిరూపం సీతారాం ఏచూరి



**ప్రజాపక్షం/కారేపల్లి:** భిన్న సంస్కృతులు, భాషలు, ఆచార సాంప్రదాయాలు, కులాలు, మతాలు, ప్రాంతాలు అనేక రకాలకు నిలవైన భారతీయత అనే భావనకు నిజమైన ప్రతిరూపం సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు కొనియాడారు. శుక్రవారం కారేపల్లిలో సిపిఎం ఆల్ ఇండియా మాజీ ప్రధాన కార్యదర్శి, మార్క్సిస్టు సిద్ధాంతవేత్త కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ వర్ధంతి కార్యక్రమాన్ని ఉద్దేశించి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి భిన్నత్వంలో ఏకత్వం అయినా భారతీయతను కాపాడుటకై తన జీవితకాలమంతటిని అంకితం చేసిన సీతారాం ఏచూరి బాటలో నడవడమే అయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. అలాంటి భావనకు ప్రతిరూపమైన భారత రాజ్యాంగాన్ని మార్చాలని ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆ ప్రయత్నాన్ని గత ఎన్నికల్లో ఇండియా కూటమిని నిర్మించడం ద్వారా సీతారాం ఏచూరి అడ్డుకున్నారని దానిలో భాగంగానే 400 సీట్లు వస్తాయని విర్రవీగిన పాలకపక్షం గతం కంటే సీట్లు తగ్గిపోయాయని ఇతరుల మీధ ఆధారపడి ప్రభుత్వాన్ని నిలుపుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు తలారి దేవ ప్రకాష్ పూలమాల వేయగా పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు వజ్జ రామారావు, ముక్క సీతారాములు, హామాలి మేస్త్రీ, ఆరేల్లి శ్రీరాములు, సైదులు, సంపత్, ఎంకన్న, బాబు, రాములు, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక వైద్య శిబిరం విజయవంతం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ ఆధ్వర్యంలో ఆళ్లపల్లిలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని డాక్టర్ సంఘమిత్ర, డాక్టర్ రేవంత్ సమన్వయంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు పాల్గొని, వైద్య బృందం అందిస్తున్న సేవలను అభినందించారు. ఈసందర్భంగా రోగులకు ఛాతీ ఎక్స్‌రేలు, నేత్ర పరీక్షలు, ఉచిత వైద్య పరీక్షలు, ఔషదాలు, ఆరోగ్య అవగాహన అందించారు. స్థానిక ప్రజలు ఈ శిబిరాన్ని ఎంతో ఆదరంగా స్వీకరించి, తమ గ్రామాల వద్దకే నిపుణుల వైద్య సేవలు అందించినందుకు ఐటిడిఏ భద్రాచలం ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 395 మంది ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, ఎంఈవో శాంతారావు, ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలసిబ్బంది, పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** స్థానిక సారపాక బ్రిలియంట్ విద్యా సంస్థల నందు ఈనాడు వారు విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు 100కు పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇలాంటి పోటీలో పాల్గొని తమ సామర్థ్యాలను నిరూపించుకోవాలని కోరారు. ఇలాంటి పోటీలు నిర్వహించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం అంతే కాదు విద్యార్థులకు తమ ప్రతిభను చాటు కొనుటకు మంచి సదవకాశమని, కనుక ప్రతి ఒక్కరూ పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకొని తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి ఆర్ వర్ష, ద్వితీయ బహుమతి ఎం స్వాతిక, తృతీయ బహుమతి యు విష్ణు ప్రియలు గెలుపొందారు. బహుమతులను బ్రిలియంట్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో బ్రిలియంట్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్, హెడ్ మిస్సెస్ బి స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దుద్దుకూరి గోపయ్య మృతి బాధాకరం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** దుద్దుకూరి గోపయ్య మృతి బాధాకరమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. శుక్రవారం దుద్దుకూరు గోపయ్య అనారోగ్యం మృతి చెందారు. కాగా గోపయ్య భౌతిక గాయానికి పూలమాల వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. వారి మరణం పట్ల ప్రగాఢ సానుభూతి సంతపాన్ని తెలిపారు. వాకి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంటనే సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్‌కే నాగుల్ మీరా, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే చాంద్ పాషా, సిపిఐ నాయకులు ఎల్లంకి మధు, పాటి వీరభద్రమ్, తదితరులు నివాళులర్పించారు.

# యూరియా కోసం రైతులు ఆందోళన



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల కేంద్రంలో యూరియా పంపిణీ లో నిరసనలు చేపట్టారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహాకార పరపతి సంఘం లో శుక్రవారం యూరియా పంపిణీ పోలీసులు పహారా చేపట్టారు. గత మూడు రోజుల క్రితం రైతులకు కూపన్లు జారీ చేశారు. కాగా మొత్తం 300 మంది రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఒక్కో రైతుకు కట్ట చొప్పున అందించారు. కాగా అధికారులు కూపన్లు జారీ చేసే సమయంలో సీరియల్ నెంబర్లు డబులు వేయటంతో వివాదం జరిగింది: నెంబర్ పిలిచిన సయమంలో ఇరువురు రైతులు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వివాదం తారా స్థాయిలో జరిగింది. గంటల తరబడి క్యూలో నిలుచుంటే ఒక్క కూపన్ ఇచ్చారు. ఇప్పుడు అది కూడ ఇవ్వకుండా డబుల్ నెంబర్లు వచ్చాయని అధికారులు, పోలీసులు అడ్డుకోవటం పట్ల రైతులు అగ్రహాం వ్యక్తం చేశారు. ఓ రైతు సోసైటీ ప్రధాన ద్వారం వద్ద నేల పై పడుకుని నిరసన తెలిపారు. పోలీసులు సదరు రైతు ను హెచ్చరించారు. అయినప్పటీకీ రైతులు నిరసన కార్యక్రమం ను చేపట్టారు. అధికారులు జోక్యం చేసుకుని రైతుకు కట్ట ను అందించేందుకు అంగీకరించటంతో నిరసన విరమించారు.

# జానయ్యకు యాదవ్ సంఘం నివాళి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని అనాసాగరం గ్రామానికి చెందిన గొర్రెల పెంపకదారుల సంఘం మాజీ అధ్యక్షుడు నోముల జానయ్య గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గొర్రెల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్ శుక్రవారం ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అయన మాట్లాడారు జానయ్య మృతి యాదవ్ సంఘానికి తీరని లోటున్నారు. యాదవ్ సంఘం కుటుంబానికి ఎల్లావేలా అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని కోరారు. నివాళులర్పించిన వారిలో గొర్రెల పెంపకం దారుల సంఘం మండల అధ్యక్షుడు మల్లెబోయిన ఉపేందర్, కార్యదర్శి యాడ్ల తిరుపతి రావు, యాదవ్ సంఘం మండల అధ్యక్షుడు మల్లెబోయిన శ్రీనివాస్ రావు, యాదవ్ సంఘం మండల కార్యదర్శి కనకబండి రమేష్, మన్నెం కృష్ణ,బాలిన కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

# కార్మిక హక్కులు కాలరాస్తే ఊరుకోం

## ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** గత సంవత్సర కాలంగా రెండు సార్లు డైరెక్టర్ పా ఒకసారి సిఎండి తో సమావేశం జరిగిన సమయంలోఒప్పుకున్న అంశాలను కూడా సర్కులర్ ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. శుక్రవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ, స్వంతఇంటి పథకం పై కమిటీ వేసిన ఇంతవరకు ఒక సమావేశం జరుగ లేదు. దీనిపై 2009వ సంవత్సరం లో స్వంత యింటి పథకంపై సర్కు లర్ ఇచ్చిన అనాడు కార్మికులు ఇష్టం పడలేదు అన్నారు. దాన్నే అమలు చేయండి అంటే కాలయాపన చేయడం వలన కార్మికవర్గం నష్టపోతున్నదనీ చెప్పారు. మెడికల్ బోర్డు విషయంలో 10 సంవత్సరాలనుండి కొనసాగిన ఆనాడు లేని ఏసీబీ బూచి చూపి బోర్డు ఆపడం యాజమాన్యం చేసిన తప్పు, దీన్ని గతంలో లాగా మెడికల్ బోర్డు పెట్టాలినీ చెప్పారు. వాస్తవ లాబాలు ప్రకటించి అందులో 35 వాటా ప్రకటించాలి. ఇన్కమ్ టాక్స్ విషయంలో కోల్ ఇండియా మాదిరిగా పెర్క్స్ పై రికవరీ చేసిన వాటిని రిఫండ్ చేయాలి అన్నారు. అంటే సింగరేణి లో లాభల్లో వాటా ఇస్తున్నాము కాబట్టి ఇవ్వలేము అంటుంన్నారు. ఇది కరెక్ట్ కాదు. ఎన్నడూ లేనివిదంగా ట్రాన్స్ఫర్ పాలసీ తెచ్చి కార్మిలను ఇబ్బంది పెట్టె కార్యక్రమం చేస్తున్నారు. దీన్ని మార్చమంటే దీనిపై ఏలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. ఈపి ఆపరేటర్ల విషయంలో డి టు సి, సి టు బి ఆపరేటర్లకు ఒప్పుకున్నా ఇంతవరకు సర్కులర్ ఇవ్వలేదు. కాలయాపన చేస్తున్నారు. డిస్మిస్ కార్మికులకు మరొకసారి అవకాశం ఇవ్వాలని కోరగా నాన్చివేసే ధోరణి కొనసాగిస్తున్నారు. దాన్ని పరిష్కరించాలి చెప్పారు. అన్ని క్యాడర్ స్కీంలను పరిష్కరిం చాలని డిమాండ్ చేయగా దానిపైకూడా కాలయాపన చేస్తున్నారు. మారుపేర్ల విషయం పైన యాజమాన్యం స్ట్రక్చర్ సమావేశంలో అంగీకరించి అడ్వకేట్ జనరల్




నుండి అభిప్రాయం రావాలి అని కాలయాపన చేస్తున్నారు. 2018 నుండి పెండింగ్లో ఉన్న, తిరస్కరించిన డిపెండెంట్ ఎంప్లాయి మెంట్ 2024 సర్క్యులర్ ప్రకారం అందరికి ఇవ్వాలి. కాంట్రాక్టు వర్కర్స్ హై పవర్ వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేయాలనీ కోరగా నాన్చి వేసే ధోరణి చేస్తున్నారు. అర్హత కల్గిన ఓవర్మెన్ లకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేయగానే ఖాలీ లు లేవని తాత్సరం చేయడం వలన వాళ్ళ సీనియారిటీ దెబ్బ తింటున్నది. మైనింగ్ ట్రేడస్మెన్ ల సూటబుల్ జాబ్ విషయంలో యాజమాన్యం ఒప్పుకొని చాలా కాలం అయింది. దీనిపై యాజమాన్యం వైఖరి పట్ల తీవ్రంగా వ్యతిరేకస్తున్నాము. క్లరికల్ ఖాళీ లు పూర్తిచేయడంలో పూర్తిగా వైపల్యం. రెండు సంవత్సరాల అయిన ఇంతవరకు పరీక్షలు పెట్టక పోవడంవలన కొంతమంది కోర్ట్ కు వెళ్లడం జరిగింది. విషయంలో యాజమాన్యానికి నాయాపైసా నష్టం లేకున్నా దానిపై నిర్ణయం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నది ఆయన అన్నారు. పై కార్మికుల సమస్యల దృష్టిలో పెట్టుకొని ఈరోజో జరుగల్సిన స్ట్రక్చర్ మీటింగ్ బహిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సారయ్య, వై వి రావు, వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, ఎల్లయ్య, సెంట్రల్ కమిటీ సెక్ర టరీ వంగ వెంకట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయానికి కల్యాణ సింహాసనం వితరణ

**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండల పరిధిలోని గార్ల ఒడ్డు లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శుక్రవారం కల్యాణ సింహాసనం వితరణగా అందజేశారు. తల్లాడ మండలానికి చెందిన విజయలక్ష్మి రైస్ ఇండస్ట్రీ బొజ్జ నరసింహారావు, నాగలత దంపతులు 56వేల విలువ చేసే స్వామివారికి కళ్యాణం నిర్వహించేందుకు ఆలయానికి అందజేశారు. నరసింహారావు తన ఇద్దరు పిల్లలు చదువుల నిమిత్తం అమెరికా వెళ్లినందుకు స్వామివారికి ఈ సింహాసనం చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బిట్కూరి నాగరాజాచార్యులు, వేణుగోపాల ఆచార్యులు, కిరణ్ కుమార్, ఆచార్యులు సింహాసనం పై విగ్రహ మూర్తులను పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# కాలువ యూటీకి మరమ్మతులు చేపట్టండి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని కొత్త కొత్తూరు వద్ద ప్రమాదకరంగా మారిన కాలువ యూటీ రహదారిని మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంను నిరసిస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మోకాళ్ల పై నిలబడి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఇరిగేషన్ అధికారికి వినతి పత్రం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బుద్దారం మేజర్ కాలువ యూటీ పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. దీని వలన రైతులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని ఆరోపించారు. పాలకులు, అధికారులకు పలుమార్లు చెప్పిన పట్టించుకోవటం లేదని ఆరోపించారు. వెంటనే శాశ్వత పరిష్కారం చూపకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధానకార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, కల్యాణం నాగేశ్వరరావు, కొండా హర్షవర్ధన్, కందరబోయిన గోపి, వేణుబాబు, వెంకటేశ్వర్లు, లక్ష్మినారాయణ, రమేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# డిపార్ట్మెంటల్ క్రీడలు ప్రారంభం

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కార్పోరేట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ గేమ్స్ ఆధ్వర్యంలో సంవత్సర వార్షిక క్రీడలను శుక్రవారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో డిజిఎం పర్సనల్ వెల్ఫేర్ బి.శివ కేశవ రావు అధ్యక్షతన, ముఖ్య అతిధిగా జిఎం పర్సనల్ ఈఈ సెల్ ఏ.జే.మురళీధర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సింగరేణి సంస్థ క్రీడాకారుల కోసం నైపుణ్యం కలిగిన కోచ్ లతో కోచింగ్ క్యాంప్ లను నిర్వహిస్తు క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని అన్నారు. మంచి క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని, క్రీడలు అనేవి శారీరక దృడత్వానికి, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఉద్యోగులు తమ తమ పనులను నిర్వహిస్తూనే క్రీడలలో ఆసక్తి చూపడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ క్రీడలలో సీనియర్ క్రీడాకారులతో పాటు యువ ఉద్యోగులు ఎక్కువగా పాల్గొనేలా ప్రోత్సహించి కోల్ ఇండియా స్థాయి పోటీలలో మన సంస్థ మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఇటీవల సింగరేణి సంస్థలో మహిళా ఉద్యోగుల సంఖ్య కూడా పెరిగిన నేపథ్యం లో యువ ఉద్యోగులతో పాటు మహిళా ఉద్యోగులు కూడా పాల్గొనేలా చూడాలని తద్వారా మహిళలు వారు కుటుంబ బాధ్యతలతో పాటు క్రీడలను కూడా వారి దైనందిన జీవితం లో ఒక భాగం చేసుకుంటారని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి ఆట గా



ఫుట్ బాల్ మ్యాచ్ ను హెడ్డాఫీస్ వర్సెస్ ఎస్ పిసి డిపార్ట్ మెంట్ గ్రూప్ మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిఎం పర్సనల్ ఈఈ సెల్ ఏ.జే.మురళీధర రావు, డిజిఎం పర్సనల్ వెల్ఫేర్ బి.శివ కేశవ రావు, కార్పొరేట్ సిఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎస్.వేంకటా చారి, గుర్తింపు సంఘం ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టియూసి కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, డివై.పిఎం హనరరీ సెక్రటరీ కే.సునీల్ కుమార్, కమ్యూనికేషన్ ఆఫీసర్ కే.ఉదయ్ కుమార్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ ఎంసి. పోస్ నెట్, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.నితిన్ కుమార్, ఫుట్ బాల్ కెప్టెన్ పి.నాగి రెడ్డి, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# సెంట్రల్ లైటింగ్ పనులు శరవేగంగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ లైటింగ్ పనులను శర వేగంగా పూర్తి చేయాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రం నుంచి తిరుమలాపురం వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభంకు సిద్ధం చేయాలని సూచించారు. త్వరలోనే మంత్రి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలకు నూతనంగా కొత్త వెలుగులతో పట్టణం ఉండేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొడాలి గోవిందరావు, కడియాల నరేష్, కైలాసపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘనసన్మానం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు ను అందుకున్న నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి చలపతిరావు కు ఘన సన్మానం చేశారు. మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ప్రవేట్ పాఠశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మోమెంట్ ను అందించి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడారు. మండలంలో విద్య ను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని సూచించారు. అందరి సహాకారం వలన అవార్డు ను సాధించినట్లు తెలిపారు. ప్రవేట్ పాఠశాలలు కూడ నిబంధనలు పాటించి విద్యను మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రవేట్ పాఠశాలల యాజమాన్యం కమిటి ప్రతినిధులు వాకదాని నాగేశ్వరరావు, కనపర్తి నాగేశ్వరరావు, మరియ ప్రసాద్, చిన్నబాబు, మరియ, మాధవరావు పాల్గొన్నారు.



# శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు




**ప్రజాపక్షం/ఏన్కూరు:** శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై నారబోయిన సంధ్య తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల విఘాతానికి కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నేరాల అదుపునకు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. మధ్యవర్తులు ఫిర్యాదుదారులు నేరుగా పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించాలని ఆమె అన్నారు.

# హాస్టల్ వర్కర్ల వేతనాలను వెంటనే చెల్లించాలి

## -సంఘీభావం తెలిపిన ఏఐటియుసి, సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** శుక్రవారం కొత్తగూడెం పట్టణం లోని 2వ నెంబర్ బస్తీలో ఉన్న ఎస్టి పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్ పనిచేస్తున్న వర్కర్స్ కు తొమ్మిది నెలలు గా వేతనాలు రానందు సమ్మె చేస్తున్న కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలియజేసిన ఏఐటియుసి, సిపిఐ కొత్తగూడెం పట్టణ ప్రతినిధి బృందం ఈ కార్యక్రమంలో ఏఐటియుసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య మాట్లాడుతూ. 9 నెలలుగా పెండింగులున్న వేతనాలు ఇవ్వకపోగా వారితోనే వెట్టిచాకరు చేస్తున్న కాంట్రాక్టు ఏజెన్సీని తక్షణమే రద్దుచేసి ప్రభుత్వమే కాంట్రాక్టు ఏజెన్సీ కింద వర్కర్ల నియమించి ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఆయన అన్నారు. సమ్మె చేస్తున్న వర్కర్ల వారి కుటుంబాలు పస్తులు ఉండటంవలనే సమ్మెకి వెళ్ళవలసి వచ్చిందని ప్రభుత్వాధికారులకి ఆయన చెప్పసాగా రు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్, కొల్లాపూరి ధర్మరాజు, ఎండి యూసుఫ్, సహాయ కార్యదర్శి బోయిన్ విజయ్ కుమార్, పోలోజు సత్యనారాయణ చారి, పదవ డివిజన్ కార్యదర్శి రాకేష్, సిపిఐ నాయకులు అజీజ్ మహిళా సమైక్య నాయకురాలు పుట్ట భాగ్యలక్ష్మి, రెండో నెంబర్ బస్తి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ రామకృష్ణ, రామారావు, ఏరియా ఆరు వార్డులు ఇన్చార్జి కార్యదర్శి మండల రాజేశ్వరరావు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.



# ప్రమాదకరంగా మూల మలుపులు

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని దారుక బంజర్, తాళ్లూరు వెంకటాపురం, పెద్ద కోరుకొండి పెట్రోల్ బంకు వద్ద, చెన్నూరు లోని చెరువు కట్ట వద్ద, పంచదార పరిశ్రమ వద్ద ఈ మూలమలుపులు ప్రమాదకరంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నవి. దట్టమైన చెట్లు పెరిగి ఉండటం వలన ముందు వచ్చే వాహనాలు తెలియకపోవటం వలన పగలు రాత్రి ప్రమాదాలు జరుగుతున్నవి. ఈ ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు రోడ్లు భవనాల శాఖ వారు పెట్టించి ప్రమాదాల నుంచి రక్షించాలని ద్విచక్ర వాహనదారులు, వాహనదారులు ఆర్ అండ్బి శాఖను కోరుతున్నారు. మూలమలుపుల వద్ద ఎత్తుగా చెట్లు పెరిగి రాకపోకలు విషయాలను తెలియక స్పీడ్ గా వచ్చి ఎదురెదురుగా వాహనాలు ఢీకొనటం వలన గాయాలు పాలై ఆసుపత్రులు చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్బి శాఖ అధికారి రవిచంద్రను వివరణ కోరగా చెట్లు కొట్టిస్తామని వివరించారు. ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు వద్ద సూచిక బోర్డులను పెట్టిస్తామని పేర్కొన్నారు.

